క్లుప్తంగా

బోరుకు శంకుస్థాపన



గోపినాథపట్నంలో బోరుకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచి విష్ణు

ఉంగుటూరు: జలకళ పేద రైతులకు ఎంతగానో ఉపయోగపడుతోందని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షుడు, గోపినాథపట్నం సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి అన్నారు. ఆదివారం గోపినాథపట్నంలో చేబ్రోలుకు చెందిన రైతు గుడ్ల శ్రీను పొలంలో జలకళలో మంజూరైన బోరుకు విష్ణుమూర్తి శంకస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు మాజీ సర్పంచి వైసీపీ నాయకుడు కరణం బుజ్జి, నాయకులు రాయి మునేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు ఆకుల రాజా పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై నేడు సమావేశం

దెందులూరు: జాతీయ రహదారిపై కొమిరేపల్లి వద్ద తరుచూ ప్రమాదాలు జరగడం, మృత్యువాత పడటంతో ప్రయాణికులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై చర్చించేందుకు, అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు గరుడ హోటల్‌లో సమావేశం ఏర్పాటు నిర్వహించనున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. ఎన్‌హెచ్‌ఎ అధికారులు, గ్రామస్తులు, ప్రభుత్వ ఉద్యోగులు సమావేశానికి హాజరవుతారని, ప్రమాద నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తారని ఆయన తెలిపారు.

సానిగూడెంలో ముమ్మరంగా ఉపాధి పనులు



సానిగూడెం పెద్ద చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

దెందులూరు: మండలంలోని సానిగూడెంలో ముమ్మరంగా ఉపాధి పనులు నిర్వహిస్తున్నారు. 164 మంది కూలీలు పూడికతీత పనులు చేస్తున్నారు. గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ జె.రాజు, టెక్నికల్ అసిస్టెంట్లు ఉపాధి కూలీలు చేసిన పనుల కొలతలను చూసి నమోదు చేశారు. గ్రామగ్రామాన ఉపాధి పనులు వేగంగా జరుగుతున్నాయి.

అభయాంజనేయస్వామికి జన్మనక్షత్ర పూజ



అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఉత్సవమూర్తి

పెదపాడు: అప్పనవీడు ఆలయంలో అభయాంజనేయస్వామి జన్మనక్షత్రం పురస్కరించుకుని కొబ్బరి నీళ్లతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ వెనుక ఉన్న వేదిక వద్ద ఉత్సవ మూర్తికి పూర్వా భాద్ర నక్షత్రం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేసారు. అర్చకులు రామాచార్యులు పూజలు చేశారు. ఆలయ చైర్మన్ నెర్సు నాగభూషణం పాల్గొన్నారు.

సినీ నటుడు సుమన్‌కు ఆహ్వానం



సినీ నటుడు సుమన్‌ని సత్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

కొయ్యలగూడెం : త్వరలో నిర్వహించబోయే గౌడ గర్జన మహాసభకు హాజరుకావాలని సినీ నటుడు సుమన్‌ని ఆహ్వానించినట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, రాష్ట్ర గౌడ్ సంఘం సభ్యులు కాశగాని గోఖలే పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం విచ్చేసిన సుమన్‌ను ఆదివారం రాష్ట్ర గౌడ సంఘం నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సుమన్‌ను శాలువాతో సత్కరించామన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర గౌడ గర్జన మహాసభకు నిర్ణయించే తేదీపై ఈ నెల 25న జంగారెడ్డిగూడెంలో ముఖ్య నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర గౌడ గర్జన కార్యక్రమానికి సుమన్ తప్పనిసరిగా హాజరవుతానని అన్నారని, అలాగే కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులను ఆహ్వానించినట్లు తెలిపారు.

వడదెబ్బ.. జర జాగ్రత్త

- నిప్పుల కొలిమిగా వాతావరణం
- వేడి గాలులు వీచే తరుణంలో బయటకు రావద్దని వైద్యుల సూచన



నిర్మానుష్యంగా భీమడోలు - కొవ్వూరు జాతీయ రహదారి

భీమడోలు : కొన్ని రోజులుగా ఎండలు మండిపోతుండడంతోపాటు వడగాల్పులు వీస్తున్నా యి. మండలంలో సరాసరి 42 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే ప్రచండ భానుడు నిప్పులు కక్కుతుండడంతో జనం రోడ్లపైకి వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. దీంతో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వేసవిలో అధిక ఉష్ణోగ్రత, వేడి గాలుల కారణంగా వడదెబ్బ, డీహైడ్రేషన్(శరరంలోని లవణాలు కోల్పోవడం) కలిగే అవకాశముందని సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకమవుతుందని ఈ క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య శాఖ విస్తృత ప్రచారం చేస్తుంది. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, పిల్లలు మధ్యాహ్నం వేళ బయటకు రాకుండా చూసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే గొడుగు, ముఖానికి మాస్క్‌లను ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు. కళ్లకు అద్దాలు ధరించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అంటున్నారు.

వడదెబ్బ లక్షణాలు

ఎండలో అధికంగా తిరగడం, ఎండలో పని చేయడం, వేడి ప్రదేశాల్లో ఎక్కువ సేపు ఉండడం వల్ల ఎండ దెబ్బ సోకుతుంది. వణుకు పుట్టడం, శరీరం పాలిపోయి ఉండడం, తలనొప్పి, తల తిరగడం, జ్వరం, మత్తు నిద్ర, ఫిట్స్ లేదా పూర్తిగా అపస్మారక స్థితి లక్షణాలు కనిపిస్తాయి. నీరు చెమట రూపంలో



గ్రామాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

పోవడంతో డీ హైడ్రేషన్ జరిగి మూత్రం రావడం కష్టమవుతుంది. కొన్ని సందర్భాల్లో షాక్‌కు గురై మూర్ఛపోవడం, మరణం కూడా సంభవించే ప్రమాదముందని వైద్యులు అంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

సాధ్యమైనంత వరకు ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. రోజుకు కనీసం 15 నుంచి 20 గ్లాసుల నీరు తాగాలి. పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ ఇంట్లో ఓఆర్‌ఎస్, గ్లూకోజ్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలి, గర్భిణులు, బాలింతలు, కొబ్బరి నీళ్లు, రాగిజావ వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉంటుంది. వేసవి కాలంలో జంకు ఫుడ్స్ మసాలా, అధిక నూనెతో తయారు చేసిన పదార్థాలకు దూరంగా ఉంటే మంచిది. లేతవర్ణం గల తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి. మితంగా భోజనం చేయాలి. ఎండ వేళ ఇంటి పట్టునే ఉండాలి, ఇంట్లో కిటికీలు తెరిచి ఉంచాలి,

చేయకూడనివి

మధ్యాహ్న 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాధ్యమైనంత వరకు ఎక్కువగా ఎండగలో తిరగరాదు, సూర్యకిరణాలకు, వేడిగాలికి నేరుగా గురికావొద్దు. శీతల పానీయాలు, రంగు పానీయాలు, కలుషిత ఆహారం తినరాదు. మాంసహారం తగ్గించాలి, మద్యం సేవించరాదు, ఎండ వేళల్లో శరీరంపై భారం పడి శ్రమ గల పనులు చేయరాదు, నలుపు దుస్తులు, ముదురు రంగు కలిగిన, మందంగా ఉన్న దుస్తులు ధరించరాదు,

వడదెబ్బకు చికిత్స

భీమడోలు : వడదెబ్బ తగిలిన వ్యక్తికి దుస్తులు వదులు చేసి గాలి బాగా తగిలే ప్రదేశంలోకి తీసుకు వెళ్లాలి. కాస్త సేదతీరిన తర్వాత సాధ్యమైనంత త్వరగా చల్లని ద్రవ పదార్థాలను తాగించాలి. శరీరమంతా తడిగుడ్డతో తడపాలి, మజ్జిగ, ఉప్పుకలిపిన నిమ్మ రసం, ఎలక్ట్రోలైట్ ద్రావణం తాగించాలి, శరీర ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా ఉంటే వైద్యుల సూచన మేరకు మాత్రలు వేసుకోవాలి. షాక్‌కు గురైన సందర్భాల్లో ఉపశమన చర్యలు పాటించాలి వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



ఈ ఏడాది తీవ్రమైన వడగాల్పులు వీస్తున్నా యి. వేడి గాలులు వీస్తున్న వేళల్లో రోడ్లపై సంచరించవద్దు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు ఎండలో బయట తిరగకపోవడం మంచిది. అత్యవసర పరిస్థితిల్లో వెళ్లాల్సి వస్తే గొడుగు, కళ్లకు అద్దాలు ధరించారు. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించరాదు, వెంటనే సమీపంలోని పీహెచ్‌సీకి తరలించాలి. ఉప్పు కలిసిన మజ్జిగ, చిటికెడు ఉప్పు కలిగిన గ్లూకోజ్ ద్రావణం గాని ఓఆర్‌ఎస్ తాగించవచ్చు. సచివాలయాల పరిధిలోని వైద్య ఆరోగ్య సిబ్బందితో వడదెబ్బ వల్ల నష్టాలు, వాటి నుంచి రక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– బి.లీలా ప్రసాద్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, పూళ్ల

ఐదుగురు ఉపాధి సిబ్బంది నియామకం

దెందులూరు: దెందులూరు మండలానికి ఐదుగురు నూతన సిబ్బంది నియమితులయ్యారని దెందులూరు ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి తెలిపారు. కే.మధుశేఖర్ టీఏ, ఏ.కిషోర్, టీఏ, పీ.రమేష్ టీఏ, వీ.సురేంద్ర సీఓ, బీ. విజయభాస్కర్‌రెడ్డి సీఓలు రేషనలైజేషన్‌లో భాగంగా కర్నూలు జిల్లా నుంచి బదిలీపై వచ్చారని వివరించారు. ఐదుగురు ఉద్యోగులు విధుల్లో చేరారన్నారు.

నూతన జెడ్పీ చైర్‌పర్సన్‌కు పలువురి అభినందన

దెందులూరు: గాలాయగూడెం గ్రామాభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు అన్నారు. ఆదివారం నూతన జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి, వార్డు మెంబర్లు శ్రీధర్, రాజేష్‌తో కలిసి సత్కరించారు. గ్రామాభివృద్ధికి సంబంధించి వినతిపత్రం అందజేశారు. గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ అన్నారు.

గడ్డివాము దగ్ధం

దెందులూరు: మండలంలోని చల్లచింతలపూడిలో ఆదివారం తెల్లవారు జామున గడ్డివామును గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పశువుల మేతకు ఉపయోగపడే గడ్డివాములను దగ్ధం చేయడమేమిటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే రైతులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. బాధిత రైతులు మాట్లాడుతూ గడ్డివామును దగ్ధం చేసినవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

పుస్తక పఠనంతో మానసిక వికాసం



భీమడోలులో విజేతలకు ప్రశంసాపత్రాలు అందించిన జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్



పిప్పరలో విజేతలకు ప్రశంసాపత్రాలు అందించిన గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు



పెదవేగి గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు, ప్రశంశా పత్రాలు అందిస్తున్న దృశ్యం



ఉంగుటూరు శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీటీసీ బాలకృష్ణ

భీమడోలు: పుస్తక పఠనం ద్వారా మనోవికాసంతోపాటు, విజ్ఞానం వృద్ధి చెంది సునాయాసంగా విజయాలు సాధించవచ్చని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు శాఖ గ్రంథాలయంలో 35 రోజులుగా చేస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. వేసవి శిక్షణను పూర్తి చేసుకున్న 60 మంది చిన్నారులకు ప్రశంసాపత్రాలను, విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీతామాన్‌సింగ్ పాల్గొన్నారు. దాతలు డాక్టర్ సత్యం ఫౌండేషన్, విశ్రాంత ఉపాధ్యాయులు గుల్లా నూకరాజు, సత్యసాయి సేవా సమితి, స్వామి వివేకానంద యూత్ సహకారంతో విద్యార్థులకు ఆట పరికరాలు, బహుమతులను అందించారు. రిసోర్స్‌పర్సన్లు మండే సుధాకర్, పోలిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, భ వనారుషి, గుల్లా నూకరాజు, గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్, పిల్లి మణికంఠరాజును దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. తొలుత చిన్నారి పాలేటి సుదీక్షణాంజలి కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మద్దాల అప్పారావు, స్వామి వివేకానంద యూత్ అధ్యక్షుడు సుతాపల్లి ప్రసాద్, పాలేటి పాఠశాల అధినేత పాలేటి శ్యామ్, పెద్దలు నాని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన తరగతులు

ఉంగుటూరు: స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సమావేశం ఆదివారం నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు పి. బాలకృష్ణ, ఆర్.వెంకటేశ్వరరావు, అప్పారావు, గ్రంథపాలకుడు చిట్టూరి గంగాధరరావు పాల్గొన్నారు.విద్యార్థులకు, ప్రతిభావంతులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

గణపవరం: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల ముగింపు సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో గణపవరం మండల ఉపాధ్యక్షురాలు సలాది దుర్గారత్నకుమారి పాల్గొన్నారు. కార్యక్రమానికి సర్పంచ్ మూర అలంకారం అధ్యక్షత వహించారు. వివిధ పోటీల్లో ప్రతిభచూపినవారికి బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. గ్రంథాలయ అధికారిణి సుభాషిణి, మండల మానవత అధ్యక్షుడు వంకాయల రామారావు పాల్గొన్నారు. పిప్పర శాఖా గ్రంథాలయంలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతుల ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వివిధ పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ అందించారు. అభివృద్ధి కమిటీ సభ్యులు ఐవీఎన్‌రాజు, గుడ్ల మురళీకృష్ణ, పి.గోవింద్, వైఎస్సార్ టీఎఫ్ జిల్లా నాయకుడు కాకర శ్యాంసన్ పాల్గొన్నారు.

పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో..

పెదవేగి : పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందించారు. సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి, సొసైటీ విశ్రాంత కార్యదర్శి వీరం చింతయ్య, గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్, మోహనరావు పాల్గొన్నారు.

ఉంగుటూరులో ఉచిత ఇన్సులిన్ శిబిరం



వైద్యసేవలు అందిస్తున్న డా.పీవీ రావు

ఉంగుటూరు: ఉంగుటూరులో డా.పాతూరి శివన్నారాయణ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత ఇన్సులిన్ మెడికల్ శిబిరం నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ శిబిరానికి 18 ఏళ్లలోపు పిల్లలు మూడు జిల్లాలకు చెందిన 80 మంది, పెద్దవాళ్లు 25 మంది హాజరయ్యారు. ఆలిండియా డయాబెటీస్ సొసైటీ అధ్యక్షుడు డా.పీవీ రావు స్వయంగా ఈ శిబిరంలో సేవలు అందించారు. ఈ శిబిరానికి హాజరైన రోగులను అమెరికా నుంచి తెప్పించిన యంత్రంతో పరీక్షించారు. మూడునెలలకు సరిపోయే ఇన్సులిన్ మందును, ప్రొటీన్ పౌడర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎక్స్ కంపెనీ ఉచితంగా హెల్త్ డ్రింకు పంపిణీ చేసింది. వచ్చిన వారందరికీ ఉచితంగా భోజన సదుపాయం కల్పించారు. ట్రస్టు నిర్వాహకులు పూతూరి వంశీకృష్ణ, సహాయకులుగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, పాతూరి విజయకుమార్ పాల్గొన్నారు. ఉచిత కంటి వైద్యశాల టెక్నీషియన్ మోహిని, ట్రస్టు ఉచిత వైద్యశాల టెక్నీషియన్ బండారు మెనిక ప్రసన్న హైదరాబాదు నుంచి వచ్చిన వైద్యులు, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

నేడు అంబర్‌పేటలో గడపగడపకు మన ప్రభుత్వం

భీమడోలు: అంబర్‌పేటలో ఈనెల 12వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు ఆదివారం రాత్రి తెలిపారు. నాలుగేళ్ల పాలనలో అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు వివరిస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

నేడు కేఎన్ పురంలోగడపగడపకు మన ప్రభుత్వం

దెందులూరు: రామారావుగూడెం సచివాలయ పరిధిలో కంద్రికనర్సింహపురంలో సోమవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. అన్ని శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరుకావాలని నాని కోరారు.

పునఃప్రారంభోత్సవానికి ప్రభుత్వ బడులు ముస్తాబు





ఛానమిల్లి హైస్కూల్లో చిత్తు కాగితాలు, చెత్త తొలగిస్తున్న కూలీలు, బువ్వనపల్లి యూపీ పాఠశాలలో శుభ్రం చేస్తున్న సిబ్బంది

గణపవరం: చదువుల పండుగకు సర్వం సిద్ధమైంది. సరస్వతీ నిలయాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభ రోజున పాఠశాలలను సుందరంగా అలంకరించి ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులకు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం సందర్భంగా గణపవరం, నిడమర్రు మండలాల్లోని సుమారు 100 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను ముస్తాబు చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. నాలుగు రోజులుగా పాఠశాల తరగతి గదులు, వరండాలలో బూజులు దులిపించి, నీటితో శుభ్రంగా కడిగించారు. పాఠశాల ఆట స్థలాల్లో చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి, కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు వ్యర్థాలను శుభ్రం చేశారు. పాఠశాల ఆవరణ నిండా రంగురంగుల రంగవల్లులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పాఠశాల గుమ్మాలు, కిటికీలకు మామిడి తోరణాలు కట్టారు. ఈనెల 12వతేదీ సోమవారం పాఠశాల ప్రారంభం రోజునే పండుగ వాతావరణంలో జగనన్న విద్యాకానుక కిట్లు, పాఠ్యపుస్తకాలు గ్రామ ప్రముఖులు, ఎస్ఎంసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, దాతల సమక్షంలో విద్యార్థులకు పంపిణీ చేయడానికి ఉపాధ్యాయులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు అన్ని పాఠశాలలకు 50 శాతం పైగా కొత్త ఉపాధ్యాయులు వచ్చి చేరారు. తొలిరోజునే జగనన్న విద్యాకానుక కిట్లు అందించి, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, రాగిజావ అందించాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో ఉపాధ్యాయులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ప్రభుత్వం అన్ని పాఠశాలలకు బియ్యం, కోడిగుడ్లు, చిక్కీలు, రాగి పౌడర్, బెల్లం పొడి సరఫరా చేసింది.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



ముందూరు సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం, వాహనాన్ని సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు

పెదవేగి : తక్కువ ధరలకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తూ అధిక ధరలకు విక్రయించే ముఠా గుట్టును రట్టు చేశారు విజిలెన్స్ అధికారులు. విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కూచింపూడి గ్రామానికి చెందిన ఉప్పాల ప్రకాష్ ద్వారకాతిరుమల, పెదవేగి మండలాలల్లోని వివిధ గ్రామాల నుంచి ముందూరు మీదుగా కూచింపూడి గ్రామానికి రేషన్ బియ్యం తరలిస్తున్నాడన్న సమాచారంతో ముందూరు పోలవరం కుడికాలువ దగ్గర ఆదివారం నిఘా పెట్టారు. బియ్యం లోడుతో వెళుతున్న ఏపీ16టీఎస్1454 నంబర్ గల వాహనాన్ని ముందూరు పోలవరం కుడికాలువ వంతెన వద్ద విజిలెన్స్ అధికారులు అడ్డుకున్నారు. దానిలో 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, కూచింపూడి గ్రామానికి చెందిన ఉప్పాల ప్రకాష్‌కు చెందినవిగా గుర్తించామని, డ్రైవర్ గిత్తా శివ, సహాయకులుగా ఉన్న ముత్యాల గంగరాజు, పెద్దిశెట్టి ఫణీంద్ర, వాహనం ఓనర్ చందు నాగబాబుపై కేసు నమోదు చేసి, రేషన్ బియ్యాన్ని, తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై చెప్పారు. 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం విలువ రూ.72 వేలు, వాహనం విలువ రూ 5,50,000, ఉంటుందని తెలిపారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న వారిపై నిత్యావసర వస్తువుల చట్టం దుర్వినియోగం కింద కేసు నమోదు చేశామని విజిలెన్స్ ఎస్సై తెలియజేశారు. విజిలెన్స్ ఇన్‌చార్జి డీటీ ఎండీ మోహిద్దిన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలి



ఏలూరు పాతబస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష పార్టీలు

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేసిన బీజేపీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విశాఖ పర్యటనను నిరసిస్తూ ఏలూరులో వామపక్ష పార్టీలు నిరసన వ్యక్తం చేసాయి. స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు బద్ద వెంకట్రావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు అమలు చేయకుండా ద్రోహం చేసిందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు కంపెనీలకు అప్పగించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర మంత్రులు రాష్ట్రంలో తిరిగే నైతిక అర్హత కోల్పోయారన్నారు. దేశ ప్రజల మధ్య ప్రాంతీయ, మత బేధాలు సృష్టించి ఘర్షణలకు బీజేపీ ఆజ్యం పోస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఏలూరు కార్యదర్శి పి.కిషోర్, సీపీఐ ఏలూరు కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ అ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నాయకులు కె.శ్రీనివాస్, పీవీ రామకృష్ణ, వి.సాయిబాబు, వీవీఎస్ ప్రసాద్, జె.గోపి, ఎస్ సత్యనారయణ, కె.కృష్ణమాచార్యులు, కురెళ్ల వరప్రసాద్, అడ్డగర్ల లక్ష్మి, ఎంఏ హకీమ్, తెర్లాపు శ్రీను, ఉప్పులూరి రవి, ఎం.అప్పారావు, జి.నాగేశ్వరరావు, సీహెచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

పెదవేగి : కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ చెప్పారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం పెదవేగి మండలం విజయరాయిలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 5,500 నగదు, రెండు కోళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.